క్లుప్తంగా

మే 2న అత్తాకోడళ్లు, భార్యాభర్తలకు అవగాహన సదస్సు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది బైబిల్ మిషన్ ప్రాంగణంలో మే 2వ తేదీ అత్తాకోడళ్లు, భార్యాభర్తలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ మెంబర్, బైబిల్ మిషన్ జిల్లా ఇన్‌చార్జ్ రెవరెండ్ ఆర్.ఎం.పి.ప్రభాకర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీలోగా ఉచిత రిజిస్ట్రేషన్ల ద్వారా భార్యాభర్తల అవార్డులకు, అత్తాకోడళ్ల అవార్డులకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కేవలం అత్తాకోడళ్లు, భార్యాభర్తల మధ్య ఎలాంటి బంధాలు ఉండాలి, ఎలాంటి బంధాలు ఉండకూడదనే విషయంపై సైకాలజిస్ట్, ఫ్యామిలీ కన్సల్టెంట్ ద్వారా ప్రసంగం ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, పాల్గొనే అత్తాకోడళ్లు, భార్యాభర్తలకు ఎంపిక కాకపోయినా బహుమతి అందజేస్తారని తెలిపారు.

రూ.50 లక్షలతో కల్వర్టు నిర్మాణం


పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీమకుర్తి: మండలంలోని బూదవాడ పంచాయతీ పరిధిలో మండల పరిషత్ నిధులు రూ.50 లక్షలతో కల్వర్టు స్లాబ్ నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు శనివారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కల్వర్టు నిర్మాణం వలన స్థానిక ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, ఎంపీటీసీ సభ్యులు పాపిరెడ్డి, మేదరమెట్ల శ్రీనివాసులు, ధర్మవరపు సంజీవరెడ్డి, జే యాకోబు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి

ఒంగోలు: స్థానిక కేశవస్వామిపేటలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానం ఉప ఆలయమైన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని పునఃప్రతిష్ఠ చేసి 40 రోజులైన సందర్భంగా శనివారం మహాశాంతి హోమం, చతుర్దశ కలశ స్నపన, నూతన మకర తోరణం సమర్పణ, వాస్తు హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగార్జునదేవ్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, సూపర్‌బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి, భక్తులు పాల్గొనగా, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు


మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు


ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సూర్యనారాయణరాజు అన్నారు. శనివారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, ఇతర పార్టీలు అవినీతి మయం అయ్యాయని, అందువల్ల జాతీయ భావాలు కలిగిన జనసేనతోనే తాము పోటీ చేస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఉత్తరప్రదేశ్ తరహాలో మాఫియా కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతిపై సమర శంఖం పూరించేందుకు మే 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు ప్రచార భేరి కార్యక్రమాన్ని బీజేపీ నిర్వహిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యానం చినయోగయ్య యాదవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సెగ్గెం శ్రీనివాసరావు, నరసరావుపేట జోనల్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.9,68,242

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.9,68,242 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.28,400, తలనీలాలు రూ.34,125, ప్రత్యేక దర్శనం రూ.2,00,300, లడ్డుప్రసాదాలు రూ.1,79,165, అన్నదానం రూ.4,49,532, రూమ్‌అద్దెలు రూ.25,960 వచ్చినట్లు తెలిపారు.


కొత్తపట్నం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఒంగోలులోని ఈద్గా వద్ద శుద్ధి చేసుకుంటున్న ముస్లింలు


ఈద్ ముబారక్ చెప్పకుంటున్న ముస్లింలు


ముస్లింలకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన బాదంపాలు, కూల్‌డ్రింక్స్, మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

- ఒంగోలులోని ఈద్గా మైదానంలో నమాజుకు భారీగా తరలివచ్చిన ముస్లింలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసి ముస్లింలపై అభిమానాన్ని చాటుకున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


ఒంగోలులోని ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఒంగోలు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక గద్దలగుంటలోని ఈద్గా మైదానంలో శనివారం నిర్వహించిన నమాజుకు దాదాపు పది వేల మందికిపైగా ముస్లింలు హాజరయ్యారు. ముస్లిం మత గురువు మౌలానా హుస్సేన్ నమాజు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. కఠినమైన నిబంధనలతో కూడిన ఉపవాస దీక్షను నిర్వహించుకుని రంజాన్ పండుగ జరుపుకుంటూ పేదవారికి తమవంతు సాయాన్ని అందిస్తారని తెలిపారు. పేదల కుటుంబాల్లో కూడా వెలుగులు తీసుకొచ్చేందుకు తమ శక్తి కొలదీ దానధర్మాలు చేస్తూ పండుగ జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. ఈ సందర్భంగా ఈద్గాకు విచ్చేసిన ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ అభిమానాన్ని చాటుతూ ఆప్యాయతకు అద్దం పట్టారు. కొణిజేడు బస్టాండు వద్ద నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముస్లింల నమాజు సమయంలో ఇతరత్రా అంతరాయాలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మరోవైపు నగరంలోని పలు మసీదులలో కూడా రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించిన నమాజులకు పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు.

ముస్లింల పట్ల బాలినేని ప్రత్యేక అభిమానం...

ఈద్గాలో జరిగే నమాజుకు పెద్ద ఎత్తున ముస్లింలు వస్తుండటం, వేసవి కావడంతో వారికి అసౌకర్యం కలగకుండా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాలుగు రోజుల క్రితం పెద్ద ఎత్తు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన బాలినేని.. మరోమారు వారి పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు బాదం పాలు, కూల్ డ్రింకులు, మజ్జిగ, మంచినీరు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, కార్పొరేటర్లు ఇంతియాజ్, ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు పలువురు ముస్లిం నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు దగ్గరుండి మరీ వాటిని పంపిణీ చేశారు. కఠిన ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు తన వంతు సాయంగా మూడు ప్రత్యేక కౌంటర్ల ద్వారా బాలినేని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్ మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రదేశాల నుంచి పది వేల మందికిపైగా ముస్లింలు విచ్చేస్తున్న తరుణంలో వారి పట్ల తన అభిమానాన్ని, ఆప్యాయతను బాలినేని చాటుకున్నారన్నారు. అన్నదమ్ముల్లా ప్రతిఒక్కరూ కలిసిమెలిసి ఉండాలనే భావన ముస్లింలలో ఉంటుందని, అదే కోణంలో బాలినేని కూడా తమ పట్ల సోదర భావాన్ని కనబరుస్తుండటం తమకు ఆనందంగా ఉందని అన్నారు. ముస్లింల పట్ల ఆయన హృదయంలో మంచి స్థానం ఉందని, అందువల్లే ముస్లింలు ఆయన వెంటే ఉంటున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లోనూ తప్పకుండా బాలినేనిని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో కనీసం ఒక టీరెండు సీట్లు కూడా ముస్లింలకు కేటాయించని టీడీపీ.. నేడు కపట ప్రేమ ఒలకబోస్తోందన్నారు. కానీ, వైఎస్సార్ సీపీ మాత్రం 5 కార్పొరేటర్, మూడు కో ఆప్షన్ సీట్లతో పాటు అనేక నామినేటెడ్ పదవులను కూడా ముస్లింలకు కేటాయించి సామాజికంగా మాత్రమే కాకుండా రాజకీయంగానూ ముస్లింలు ఎదగాలని ఆకాంక్షించిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా ముస్లింల పట్ల ప్రత్యేక అభిమానాన్ని కనబరుస్తున్నారన్నారు. కరోనా సమయంలో కనీసం అడ్రస్ కూడా లేని టీడీపీ నాయకులు.. నేడు ముస్లింలను ఏదో ఒక విధంగా మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. కరోనా సమయంలో పవిత్ర రంజాన్ పండుగను సైతం జరుపుకునే వీలులేని పరిస్థితులలో జలీల్ ద్వారా మాంసం, చికెన్, ఇతరత్రా సరుకులు పంపిణీ చేయించడంతో పాటు వైద్య సౌకర్యాలను బాలినేని కల్పించిన విషయం ముస్లింల కుటుంబాల్లో చిరస్థాయిగా ఉంటుందన్నారు. అందువలనే 2024 ఎన్నికల్లోనూ అఖండ మెజార్టీతో బాలినేనిని గెలిపించుకునేందుకు 95 శాతానికిపైగా ముస్లింలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖుద్దూస్, సుతారాం శ్రీనివాసులు, గంటా రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పెదకొత్తపల్లి, ఇనమనమెళ్లూరు, లింగంగుంట, తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని మద్దిపాడు ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న ఈద్గా వద్ద మౌలా అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. బంధుమిత్రుల కలయికతో ముస్లిం కాలనీలో ప్రత్యేకత సంతరించుకుంది. పలుచోట్ల ఫ్లెక్సీలు వేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మౌలాలు ఖురాన్ పవిత్ర గ్రంథంలోని పలు సూక్తులను వివరించారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం యాచకులకు తమకున్న దానిలో దానాలు చేశారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 10 గంటలకు ముస్లింలు ఈద్గాకు చేరుకుని ఒకరుకొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈద్గా మైదానం ముస్లింలతో కిటకిటలాడింది. కొత్తపట్నంలోని మస్జిద్-ఎ-మహమూదీయ, అల్లూరులోని మస్‌జిద్-ఎ-అహమ్‌దీయ, రంగాయపాలెంలోని మస్‌జీద్-ఎ-నూర్, ఈతముక్కలలోని మదీన-మస్‌దీన, మడనూరులోని మదీన-మస్‌దీనలో ఆయా ప్రవక్తలు దైవసందేశాన్ని అందించారు. ఆయా కార్యక్రమాలలో ఈతముక్కల మసీద్ ప్రెసిడెంట్ షేక్ నజీర్‌బాషా, ముస్లిం పెద్ద షేక్ బాజీ, షేక్ కాజావలి, షేక్ ఇమాన్ సాహెబ్, పటాన్ సలీమ్, షేక సుభాని, షేక్ మౌలాలి, షేక్ కాలేషా, సయ్యద్ బాబావలి, అజీమ్, కరిముల్లా, ముస్లింలు పాల్గొన్నారు.


దువ్వా చేస్తున్న చిన్నారి

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని


గాంధీరోడ్డులో మంచినీరు పంపిణీ చేస్తున్న తాతా ప్రసాద్


కర్నూలు రోడ్డు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు నడుం బిగించారు. అందులో భాగంగా స్థానిక కర్నూలు రోడ్డులో 44వ డివిజన్ కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మండే ఎండలో చల్లటి నీరు అందించడం ఒక మహత్కార్యమని, ఇటువంటి మంచి కార్యక్రమానికి ఎక్కువ మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తనంత తానుగా ముందుకొచ్చి చలివేంద్రం ఏర్పాటు చేసిన గోపిరెడ్డి గోపాల్‌రెడ్డిని అభినందించారు. తొలిరోజు సందర్భంగా మజ్జిగ కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, 45వ డివిజన్ నాయకులు సీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోతడిక అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీరోడ్డులో చలివేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ మేయర్...

స్థానిక గాంధీరోడ్డులో గీతామందిరం వద్ద లయన్స్ సిటిజన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాతా ప్రసాద్ శనివారం ప్రారంభించారు. తొలిరోజు మినరల్ వాటర్‌తో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేశారు. చీదెళ్ల శ్రీహరి మాట్లాడుతూ ప్రతిరోజూ 500 లీటర్ల నీటిని జూన్ 10వ తేదీ వరకు చలివేంద్రం ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో దేవతు శ్రీరాములు, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రమేష్, లయన్స్ సిటిజన్స్ క్లబ్ కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చలువాది శ్రీహరి, శ్రవణ్ సిల్వర్ ప్యాలెస్ కుమారస్వామి, కోశాధికారి సూరే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పీపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా చెంచిరెడ్డి

- మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు

చీమకుర్తి: జిల్లా స్థాయిలో ప్రకాశం ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) క్రికెట్ పోటీలను శనివారం సంతనూతలపాడులోని ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. సీజన్-1లో ప్రారంభించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలను సంతనూతలపాడు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుంపా ఇంద్రసేనారెడ్డి స్పాన్సర్ చేస్తున్నారు. రోజుకు రెండు జట్ల చొప్పున 12 రోజుల పాటు పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు పోటీల్లో డాక్టర్స్ లెవన్ - హౌసింగ్ బోర్డు లెవన్ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా, హౌసింగ్ బోర్డు లెవన్ జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలను ప్రారంభించే ముందు దుంపా చెంచిరెడ్డి, దుంపా రమణమ్మ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయ, వైస్ ఎంపీపీ టీ రాగమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ సంతనూతలపాడు, చీమకుర్తి ప్రిన్సిపాళ్లు డీవీ రమణారెడ్డి, వీవీ శివారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తాం


త్రిపురాంతకం ఆలయంలో సంప్రోక్షణ, పూజల్లో పాల్గొన్న మంత్రి సురేష్

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నేలకొరిగిన ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠించనున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం ఆలయాన్ని సందర్శించి ఈఓ చెన్నకేశవరెడ్డితో ఈదురుగాలులు ఉరుములతో కూడిన వర్షం కారణంగా ధ్వజ స్తంభం దెబ్బతిన్న విషయంపై చర్చించారు. త్వరలో శాస్త్రోక్తంగా నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠకు తగిన ముహూర్తం, అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. సుమారు రూ.20 లక్షలతో నిర్మాణ పనులపై ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం పక్కకు తొలగించి అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జిల్లా బీసీసెల్ జిల్లా కార్యదర్శి ఆర్వీ పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి సహ కన్వీనర్ యల్లారెడ్డి, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ మల్లికార్జున్, పార్టీ నాయకులు దగ్గులు గోపాల్‌రెడ్డి మంత్రి వెంట ఉన్నారు.


ఆలయంలో ధ్వజస్తంభం పరిశీలిస్తున్న అధికారులు

ధ్వజస్తంభం పరిశీలించిన అధికారులు

త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో నేలకొరిగిన ధ్వజస్తంభాన్ని తహసీల్దార్ వీ కిరణ్, సీఐ పాపారావు, వీఆర్‌ఓ వెంకటలక్ష్మి ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు సుబ్బారెడ్డి తదితరులు పరిశీలించారు. నేలకొరిగిన ధ్వజస్తంభం సామగ్రి, తొడుగులు తూకం వేసి భద్రపరిచినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న బోర్డు అధికారులు, సిబ్బంది

కందుకూరు: నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని యోగా గురువు బీవీ రమణ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా శనివారం కనిగిరి రోడ్డులోని ఒకటవ పొగాకు వేలం కేంద్రంలో సిబ్బంది, అధికారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో యోగాసనాలను వేయించారు. ప్రాణాయామం, యోగను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. వేలం కేంద్రాల నిర్వహణాధికారులు చైన్‌రామ్‌మీనా, రాజగోపాల్‌రెడ్డి, సిబ్బంది సీహెచ్ శ్యామ్‌సుందరం, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం కర్ర ఊరేగింపు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేయ తలపెట్టిన ధ్వజస్తంభం కర్రకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ఆలయం వరకు ట్రాక్టర్‌పై ఊరేగించగా చిన్నారులు, మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి. కృష్ణవేణి, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేష నరసింహాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


ధ్వజస్తంభం కర్రను ట్రాక్టరు పై ఊరేగిస్తున్న దృశ్యం

25న వీఆర్‌ఏ సంఘ మహాసభ

ఒంగోలు: ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ జిల్లా మహాసభను ఈ నెల 25వ తేదీ స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. సభకు ముఖ్య అతిథులుగా వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి, అధ్యక్షుడు పెద్దన్న హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, గంటినపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.